క్లుప్తంగా

నిమ్మనపల్లె ఎస్‌ఐగా లోకేష్ రెడ్డి



నిమ్మనపల్లె : నిమ్మనపల్లె నూతన ఎస్‌ఐగా సి.లోకేష్ రెడ్డి గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న పి.రామకృష్ణ సంబేపల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీ కాగా, తంబళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ గా పనిచేస్తున్న సి.లోకేష్ రెడ్డి నిమ్మనపల్లె కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్‌ఐకు స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగ జీవితంలో బదిలీ తప్పదు



ఎంపీడీఓ శేషగిరిరావు దంపతులను సన్మానిస్తున్న మండల పరిషత్ సిబ్బంది

నిమ్మనపల్లె : ఉద్యోగ జీవితంలో ప్రతి ఒక్కరికి బదిలీ తప్పదని ఎంపీడీఓ శేషగిరిరావు అన్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన నెల్లూరు జిల్లా సంగం మండలానికి బదిలీ అయ్యారు. గురువారం ఆయన రిలీవ్ కాగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బంది ఎంపీడీఓ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయం ఏఓ రమేష్ బాబు, సీనియర్ అసిస్టెంట్ శశి, ఏపీఓ రమేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు



లక్కీడిప్ డ్రా తీస్తున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ : ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. గురువారం ఆర్టీసీ డిపోలో మదనపల్లె-బి.కొత్తకోట మార్గంలో లక్కీడిప్ డ్రా తీశారు. డీఎం మాట్లాడుతూ ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమన్నారు. డ్రాలో మొదటి బహుమతి నందిని, (మొగసాలమర్రి), రెండవ బహుమతి ఓలేటి శ్రీరాములు (బి.కొత్తకోట), మూడవ బహుమతి కె.రంజిత్(బి.కొత్తకోట) గెలుపొందారన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వం ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా



ఎం. ప్రభాకర్ రెడ్డి

కురబలకోట : మదనపల్లె దగ్గర అంగళ్లు మార్గంలోని విశ్వం ఇంజినీరింగ్ కళాశాలకు ప్రతిష్టాత్మక అటానమస్ (స్వయం ప్రతిపత్తి) హోదా లభించినట్లు కళాశాల చైర్మన్ ఎం. ప్రభాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ డి. రమణారెడ్డి తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పదేళ్ల పాటు ఈహోదా ఉంటుందన్నారు. దీని వల్ల కళాశాల స్థాయి పెరిగిందన్నారు. విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయన్నారు. మరింత నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందన్నారు. అటానమస్ ద్వారా సాంకేతిక మార్పులకు అనుగుణంగా పాఠ్యాంశాలు, కోర్సులు మార్చుకునే అవకాశం ఉంటుందన్నారు. కొత్త కోర్సులు అందుబాటులోకి వస్తాయన్నారు. విద్యార్థుల వ్యక్తిగత అభివృద్ధిపై దృష్టి సారించడంతో పాటు పారిశ్రామిక శిక్షణ ఇచ్చేందుకు ఈ గుర్తింపు ఎంతగానో దోహదపడుతుందన్నారు. సమిష్టి కృషి వల్ల ఈహోదా లభించిందన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం

రాయచోటి అర్బన్ : కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు గురువారం వేర్వేరుగా విడుదల చేసిన ఒక ప్రకటలలో అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలో కొనసాగించే అంశంలో కాని, పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయడం, కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, రాజధాని అమరావతికి నిధుల మంజూరు, విభజన హామీలు తదితర అంశాలపై బడ్జెట్‌లో ప్రస్తావన లేకపోవడం దారుణమన్నారు.

నాటు సారా స్వాధీనం

సంబేపల్లె : 30 లీటర్ల నాటు సారాతోపాటు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. వారి వివరాల మేరకు మండల పరిధిలోని నాగిరెడ్డిగారిపల్లె పంచాయతీ అన్నప్పగారిపల్లెకు చెందిన ఓ వ్యక్తి నాటుసారా అక్రమంగా తరలిస్తున్నారని ముందస్తు సమాచారం అందడంతో తమ సిబ్బందితో కలిసి గ్రామ సమీపంలో నాటుసారాను తరలిస్తున్న వ్యక్తితోపాటు 30 లీటర్లు నాటు సారాను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు.

జగన్ పాలనలోనే సంక్షేమ విప్లవం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం : కులాలు, మతాలు, రాజకీయ పార్టీలు చూడబోమని అర్హులైతే చాలు ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఇంటికే చేరుతాయని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక షిరిడిసాయి నగర్‌లో సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మట్లాడారు. ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధి కోసం సైనికుల్లా పని చేయాలన్నారు. భారతదేశంలో ఏ ప్రభుత్వం చేయలేని విధంగా సంక్షేమ పథకాలను దళారి వ్యవస్థ లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలోనే జమ చేయడం ఒక్క ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమన్నారు. సచివాలయ వ్యవస్థతో 500 సేవలను ఉపయోగంలోకి తీసుకొచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గ్రామాల్లో ఆశీర్వదిస్తున్నారన్నారు. గ్రామాల్లో గడప గడపకు వెళ్తుంటే సంక్షేమ పథకాలు తీసుకున్న ప్రతి ఒక్కరూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇది ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు అసత్య ప్రచారాలకు తెరతీస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి, ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలన్నారు. అలాగే ఈనెల 11వ తేదీ అనంతపురంలో జరిగే సిద్ధం కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వైఎస్సార్ సీపీ ప్రచార రథాన్ని ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో చింతల ఆనందరెడ్డి, చింతల శివానందరెడ్డి, నీళ్లభాస్కర్, శ్రీధర్‌రాయల్, లక్ష్మీనారాయణరెడ్డి, ఓరుగంటి రమేష్, ఇబ్రహీం, ఆనంద, కేశవరెడ్డి, మహబూబ్‌బాషా, అబ్దుల్ కలీమ్, వెంకట్రమణ, సాగుబడి ఆనందరెడ్డి, నరసింహులు, నరసింహారెడ్డి, రవీంద్రరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

గుర్రంకొండ : ఐదేళ్ల పాటు ప్రభుత్వం ప్రజలకు అందించిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక సక్కామధు కల్యాణమండపంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లితే వాటిని ఓట్ల రూపంలోకి మార్చుకోవచ్చన్నారు. తాము అధికారంలోకి వచ్చామని టీడీపీ వాళ్ల గాలిమేడలు కడుతున్నారన్నారు. టీడీపీ వాళ్ల కల్లబొల్లిమాటల్ని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. కార్యకర్తలు కష్టపడి పనిచేసి పీలేరు వైఎస్సార్‌సీపీ జెండా మళ్లీ మూడవసారి రెపరెపలాడించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎండీసీ చైర్మన్ హరీష్‌రెడ్డి, నాయకులు రవినాయక్, ముక్తియార్, జయచంద్రారెడ్డి, యల్లారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సుధీర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధం సమర్పణ



బాబాతో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్‌రెడ్డి

మదనపల్లె సిటీ : స్థానిక పుంగనూరు రోడ్డులోని బాబా అబ్దుల్‌హుస్సేని దర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా గురువారం గంధోత్సవం వైభవంగా జరిగింది. ఉరుసుకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిస్సార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే బి.నరేష్‌కుమార్ రెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎస్.ఏ.కరీముల్లా హాజరయ్యారు. దర్గా పరిసర ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది. ఇందులో భాగంగా దర్గాలో బాబా ఫరీద్ జెండా ప్రతిష్టించారు. బసినికొండ ఆస్థానం నుంచి ఫకీర్ల రాతీబ్‌లతో, మేళతాళాలతో ఊరేగింపుగా బసినికొండ దర్గాకు చేరుకున్నారు. గంధం ఎక్కించి ఫాతెహా నిర్వహించారు. దర్గాలోని మజార్లను గలఫ్‌లతో అలంకరించారు. హిందూ,ముస్లింలు దర్గాను సందర్శించి చదివింపులు చేశారు. ఉరుసులో దుకాణాలు పెద్ద ఎత్తున వెలిశాయి కార్యక్రమంలో దర్గా పీఠాధిపతి కె.ఎస్.ఎస్.బి నూర్‌బాబా, బాబా శిష్యులు నజీర్ పాల్గొన్నారు.

నేడు కలకడకు ఎమ్మెల్యే రాక

కలకడ : మండలంలోని కలకడ వైఎస్సార్ సీపీ కార్యాలయం (శ్రీనివాసులురెడ్డి భవనం) వద్ద శుక్రవారం ఉదయం 9 గంటలకు మండలస్థాయి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో నిర్వహించే సమావేశానికి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరవుతారని కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీదేవిలు తెలిపారు. మండలంలోని వైఎస్సార్ సీపీ కుటుంబసభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పెన్షన్ పంపిణీ



వృద్ధురాలికి పెన్షన్ ఇస్తున్న వలంటీర్ సోము

తంబళ్లపల్లె : మండలంలోని 6363 మంది పెన్షన్‌దారులకు రూ.1,88,38,500లు విడుదలైంది. ఈ మొత్తాన్ని గ్రామ వలంటీర్లు గురువారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ పెన్షన్‌దారులకు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు.

ఘనంగా దివ్యజ్ఞానానందగిరిస్వామి జన్మదిన వేడుకలు



వేడుకల నిర్వహిస్తున్న తదితరులు

కలకడ : తొగటవీర క్షత్రియ కులగురువు శ్రీశ్రీశ్రీ దివ్యజ్ఞానానందగిరి స్వామీజీ పుట్టిన రోజు వేడుకలను మండలంలోని శ్రీచౌడేశ్వరిదేవి ఆలయం వద్ద గురువారం నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు చంద్రకళ హరినాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో మండలంలోని తొగటవీరక్షత్రియ కులస్తులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా చేనేత సంక్షేమసంఘం గౌరవ అధ్యక్షుడు రాజేంద్ర, పీలేరు నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు జయరాం, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు క్రమశిక్షణ అలవరుచుకోవాలి



క్రీడా మైదానంలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి

నందలూరు(రాజంపేట) : నందలూరు ప్రభుత్వ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి ఆధ్వర్యంలో గురువారం అరవపల్లె జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన స్పెషల్ క్యాంపు విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి మాట్లాడుతూ కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. మానవ జీవన విధానంలో చెట్లు ఒక భాగమని, అన్ని విధాల తోడ్పాటు అందిస్తాయని, ప్రకృతి సమతుల్యంగా ఉండేందుకు దోహదం చేస్తాయన్నారు. అనంతరం ప్రోగ్రాం ఆఫీసర్ నీలవేణి మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్‌లో విద్యార్థులకు క్రమశిక్షణతోపాటు నిబద్ధత, సహకార గుణం, శ్రమ విలువతోపాటు సామాజిక బాధ్యత, విలువలు, జాతీయ భావన లాంటి ఉన్నతమైన అలవాట్లు అలవడతాయన్నారు. అనంతరం క్రీడా మైదానం చుట్టూ మొక్కలు నాటారు. స్పెషల్ క్యాంపులో విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన ర్యాలీ



బైకు ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంవీఐ వినోద్‌కుమార్

రాజంపేట : రాజంపేటలో గురువారం రోడ్డు భద్రత వారోత్సవాల బైకుర్యాలీని ఎంవీఐ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి సబ్ కలెక్టరేట్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో 70 మంది హెల్మెట్ ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు. సీట్ బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. కారక్రమంలో డీఎం రమణయ్య, ఆర్టీసీ, ఎంవీఐ కార్యాలయాల సిబ్బంది, హీరో హోండా, టీవీఎస్, యమహ షోరూం సిబ్బంది, డ్రైవింగ్‌స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా భైరవుడి క్షేత్రం

రాయచోటి టౌన్ : శ్రీ వీరభద్రస్వామి వారి వాహనమైన భైరవుడి క్షేత్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతానని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె సమీపంలోని ఆర్‌కేటీ రోడ్డు నుంచి శ్రీ భైరవ స్వామి ఆలయం వరకు గడప గడపకూ నిధులు రూ.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, మండల బీసీ నాయకుడు పల్లపు రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ వందాడి వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ కార్యదర్శి బుడ్డా ధర్మారెడ్డి, రాయచోటి వైస్ ఎంపీపీ జయపాల్‌రెడ్డి, సీనియర్ నాయకుడు డాక్టర్ సత్యనారాయణరెడ్డి, కౌన్సిలర్ ఆనందరెడ్డి, సర్పంచ్‌లు శంకరయ్య, దివాన్, నాగేశ్వరావు, తిరుపాల్ నాయుడు, ఎంపీటీసీలు రామ్మోహన్ నాయుడు, విశ్వనాథరెడ్డి, మాజీ ఎంపీటీసీ మాధవరం రమేష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఆనందరెడ్డి,మాజీ కౌన్సిలర్ ఖాదర్ వలి, శ్రీనివాసుల రెడ్డి, హరినాథరెడ్డి, యర్రబయన్న, నల్ల బయన్న తదితరులు పాల్గొన్నారు. అనంతరం భైరవుడి ఆలయ సమీపంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి భూమిపూజ చేశారు.



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రక్త పరీక్షలకు శాస్త్రీయతను జోడించాలి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

పీలేరు : ప్రభుత్వ ఆస్పత్రులలో రక్త పరీక్షలకు శాస్త్రీయతను జోడించాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వ్యాధుల నిర్ధారణ విభాగం, రిపోర్ట్స్ రికార్డ్స్ నిర్వహిస్తున్న విధానాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించారు. రక్తపరీక్షలు, రికార్డులు నిర్వాహణపై సిబ్బందికి, టెక్నీషియన్స్‌కు దిశా, నిర్దేశం చేశారు. ప్రస్తుతం వైద్య ఆరోగ్యశాఖ విధుల నిర్వహణలో సమూల మార్పులు చోటు చేసుకుంటున్న దృష్ట్యా, రికార్డులు, రిపోర్టుల రూపకల్పన ఆవశ్యకతను, ఉన్నత స్థాయి అధికారులకు తెలిపే యాప్‌ల నిర్వహణలో మెలకువలు ఆయన సిబ్బందికి వివరించారు. కీటకజనిత వ్యాధుల నిర్ధారణలో ప్రత్యేక చొరవ తీసుకుని మలేరియా, డెంగీ నిర్మూలనకు తోడ్పాటు ఆవశ్యకత గుర్తు చేశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్, ల్యాబ్ టెక్నీషియన్ మల్లికార్జున, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

ఎంఐఎస్ కోఆర్డినేటర్‌కు సన్మానం



ఎంఐఎస్ కోఆర్డినేటర్‌ను సన్మానిస్తున్న ఎంఈఓలు

నిమ్మనపల్లె : మండల వనరుల కేంద్రంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ గా పని చేస్తున్న నరసింహులును మండల విద్యాశాఖ అధికారులు ఎంఆర్ పద్మావతి, నారాయణ ఉపాధ్యాయ బృందంతో కలిసి సన్మానించారు. గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. 2023 -24 విద్యా సంవత్సరంలో మండల పరిధిలోని ఉపాధ్యాయులు ఫేషియల్ యాప్ ద్వారా నూరోసారి వంద శాతం హాజరు నమోదు చేయడం, సమగ్ర శిక్ష అభియాన్‌లో భాగంగా చేపడుతున్న కార్యక్రమాల అమలుపై నరసింహులు చక్కని పనితీరు కనబరుస్తున్నారని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు,సుజాత, మాధవి, ఎం ఆర్ సి సిబ్బంది సౌజన్య, పద్మనాభం, సుధాకర్, స్వాతి, మంజుల, సురేష్, అనురాధ, ఫిజియోథెరపిస్ట్ షాహిన్ తాజ్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగునీరు



రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగునీరు.

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె కోట దళితవాడలో రోడ్డుపైనే మురుగునీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువ నిర్మించి సమస్య తీర్చాలని అనేకసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. కోట దళితవాడలో దాదాపు 15 కుటుంబాలు నివసిస్తున్నాయి. అక్కడ సీసీ రోడ్డు నిర్మాణం జరిగినా, మురుగునీటి కాలువ సౌకర్యం లేకపోవడంతో, మురుగునీటితోపాటు కుళాయినీరు సైతం రోడ్డుపైనే ప్రవహిస్తోంది. అంతకంతకు మురుగు చెత్త పేరుకుపోయి ఇబ్బందికరంగా మారుతుంది. వర్షం పడితే వారి పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. మురుగునీటి కాలువ నిర్మించి సమస్య తీర్చాలని వారు అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

నేడు కలికిరిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

కలికిరి : పట్టణ పరిధిలోని ఆర్‌ఎస్‌ఆర్ కల్యాణ మండపంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు వైఎస్సార్‌సీపీ మండలస్థాయి కార్యకర్తల సమావేశం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఈనెల 11న అనంతపురంలో జరుగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సమావేశం విజయవంతానికి సంబంధించి కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మదనపల్లెలో అనుమతులులేని ఆస్పత్రులు

- రిజిస్ట్రేషన్ లేకుండానే కార్పొరేట్ ఆస్పత్రుల నిర్వహణ
- డెమో దేవశిరోమణి ఆకస్మిక తనిఖీలో వెలుగుచూసిన వైనం
- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సీజ్‌కు చర్యలు తీసుకుంటాం
- పట్టణంలోని ఆస్పత్రులన్నింటిపై తనిఖీలు నిర్వహిస్తాం



ప్రవీణ్ న్యూరో ఆస్పత్రి ఆవరణలో మాట్లాడుతున్న డెమో దేవశిరోమణి

మదనపల్లె : పెద్ద పెద్ద కార్పొరేట్ ఆస్పత్రులను తలదన్నేలా ఆరంతస్తుల భవనాలు, లోపల అంతా హై ఫై... డాక్టర్లు, నర్సుల హడావిడి. ఆస్పత్రిలోకి వెళ్లడమే తరువాయి. రోగంతో సంబంధం లేకున్నా, అనవసర పరీక్షల పేరుతో పేషెంట్ జేబుకు చిల్లు. చిన్నపామునైనా పెద్దకర్రతో కొట్టాలంటూ... జ్వరానికి సైతం వేలల్లో బిల్లులు. మనం వెళ్లింది పట్టణంలోనే పేరుమోసిన ఆస్పత్రికి అనుకుని సర్దుకుపోతుంటే... చివరకు తెలిసిందేమంటే.. పట్టణంలోని సగానికి పైగా ఆస్పత్రులకు వైద్య ఆరోగ్యశాఖ అనుమతులు లేవని..!

గురువారం అన్నమయ్యజిల్లా డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి వచ్చిన డెమో దేవశిరోమణి పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులపై నిర్వహించిన ఆకస్మిక తనిఖీలో అసలు గుట్టు రట్టయింది. దీంతో అవాక్కయిన ఆమె ఆయా ఆస్పత్రులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపి సీజ్ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో అధిక ఫీజులు వసూలుచేస్తూ, రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, రెసిడెన్షియల్ ఏరియాల్లో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఏర్పాటు చేసి ఇతరులకు ఇబ్బందులు పెడుతున్నారని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ కుమార్ జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌ఓకు ఇచ్చిన ఫిర్యాదు అధికారుల్లో కదలిక తెచ్చింది. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు మదనపల్లెకు వచ్చిన డెమో దేవశిరోమణి పట్టణంలోని ప్రవీణ్ న్యూరో, రెయిన్‌బో హాస్పిటల్, మోడరన్ హాస్పిటల్‌లను తనిఖీ చేశారు. జనరల్ ఫిజిషియన్ ఆస్పత్రి పేరుతో అనుమతులు తీసుకుని గుండెజబ్బులకు చికిత్సలు చేస్తుండటం, స్టంట్, ఇంజక్షన్‌లకు అధిక మొత్తంలో డబ్బులు తీసుకోవడం, క్యాథ్‌ల్యాబ్‌కు అనుమతి లేకుండానే నిర్వహిస్తుండటాన్ని గుర్తించారు. పేషెంట్లకు వైద్యఖర్చులకు సంబంధించిన బిల్లుగా కాకుండా స్లిప్‌లో ఎస్టిమేట్ రూపంలో వేసి ల్యాబ్‌లో కట్టించుకోవడాన్ని గమనించారు. రెయిన్‌బో, ప్రవీణ్ న్యూరో ఆస్పత్రులు వైద్య ఆరోగ్యశాఖ అనుమతులు, రిజిస్ట్రేషన్ చేయకుండానే నిర్వహిస్తున్నట్లు తేల్చారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు కాకపోయినప్పటికీ, వేరే ఆస్పత్రి ఆథరైజేషన్‌తో సర్జరీలు చేయడమే కాకుండా, ప్రభుత్వం నిర్ణయించిన మొత్తం కంటే అదనపు వసూళ్లు, ఫీజులకు సంబంధించి ధరలపట్టిక బోర్డు లేకపోవడాన్ని గమనించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ఆస్పత్రులపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు నివేదికలు పంపుతామన్నారు. దీనిపై బహుజన యువసేన పునీత్ మాట్లాడుతూ... నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులను మూసివేయించాలని, లేకుంటే జిల్లావ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామన్నారు.

మాట నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్

- దేశంలోనే అత్యధిక మొత్తంలో పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం
- జగన్ పాలనపై అన్ని వర్గాల ప్రజల్లో సంతృప్తి
- నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్



సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సమన్వయకర్త నిసార్‌అహ్మద్, ఎంపీపీ రెడ్డెమ్మ తదితరులు

మదనపల్లె : వైఎస్సార్ పెన్షన్ కానుకను ప్రతిఏటా రూ.250 పెంచుకుంటూ, నాలుగో ఏడాదికి అవ్వాతాతలకు రూ.3,000 పెన్షన్ అందిస్తానన్న హామీని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిలుపుకుని, విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచారని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. గురువారం మండలంలోని కొత్తపల్లె-1,2 పంచాయతీల్లో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిసార్‌అహ్మద్, ఎంపీపీ రెడ్డెమ్మ, వెలుగు చంద్ర, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా చలపతి, మండల కన్వీనర్ దండు కరుణాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నిసార్ అహ్మద్ మాట్లాడుతూ... చంద్రబాబు ప్రభుత్వంలో పింఛన్ల కోసం అవ్వాతాతలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తీవ్ర అవస్థలు ఎదుర్కోవాల్సిన దుస్థితి ఉండేదన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక, అవ్వాతాతలకు మనవడిగా, ఒంటరిమహిళలు, వితంతువులు, దివ్యాంగులకు అన్నగా, తమ్ముడిగా, చేనేత, కల్లుగీత, మత్స్య, చర్మకారులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు శ్రేయోభిలాషిగా, వారందరి ఆత్మగౌరవాన్ని కాపాడుతూ.. వలంటీర్ వ్యవస్థతో ఠంచనుగా 1వ తేదీ ఉదయానికల్లా ఇంటివద్దే పెన్షన్ అందించే ఏర్పాటు చేశారన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలకు లంచాలు ఇస్తేనే కొత్తగా పెన్షన్లు మంజూరయ్యే పరిస్థితి ఉండేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లంచాలు, వివక్షకు తావులేకుండా అర్హత ఉంటే చాలు, వలంటీర్ ఇంటిదగ్గరకు వచ్చి పెన్షన్‌కు దరఖాస్తు చేయించి, అర్జీ పెట్టుకున్న 21 రోజుల్లో అర్హులకు పెన్షన్ కార్డులు మంజూరు చేస్తున్నారన్నారు. దేశంలోనే అధిక మొత్తంలో రూ.3,000 పెన్షన్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం మన జగనన్న ప్రభుత్వమన్నారు. ప్రజాసంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి నిత్యం శ్రమిస్తున్న జగనన్నను మరోసారి సీఎంగా చేసుకున్నప్పుడే... ఇప్పుడు అందుతున్న సంక్షేమం, అమలవుతున్న పథకాలు కొనసాగుతాయన్నారు. అనంతరం కొత్త ఇండ్లు పంచాయతీలో రూ.12లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచులు లక్ష్మీదేవమ్మ, ఆసియాబేగం, గణేష్, ఎంపీటీసీ బస్రీ, మెహరున్నీసా, రెడ్డెమ్మ, శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కర్, ఇస్మాయిల్, వైస్ ఎంపీపీ డిష్‌రమణ, మండల జేసీఎస్ కన్వీనర్ పోతబోలునాగరాజ, నారాయణస్వామి, మహేష్, ఇర్ఫాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.